("ప్రభవ" మాసపత్రిక ప్రారంభ సంచిక - ఫిబ్రవరి 1978)

చేతికర్ర

"ఎవరయ్యా ఇక్కడింత సేపూ డ్యూటీలో వున్నది?" అని నిబ్బరంగా అడిగేరు తాసిల్దారుగారు. ఆయనలా తాపీగా మాటాడేరంటే ఎవ్వడికో మూడిందన్నమాటే.

"ఏమైంది సార్" అని వినయంగా అడిగాను. అందులో ఆయనడిగిన ప్రశ్నకి జవాబుంది.

ఒక్కసారి తారాజువ్వలా లేచేరాయన. "ఏమైందని నిమ్మళంగా అడుగుతున్నావా? నీకుద్యోగం పోతే జంధ్యాలు వొడుక్కుని తద్దినాలు పెట్టి బతికేస్తావు. నాకూ కలెక్టరు గారికీ ఉద్యోగాలు పోతే చావొక్కటే మార్గం! నీలాంటి బాధ్యత లేని వ్యక్తుల్ని బంగళా డ్యూటీకి వేస్తే ఇంతే!"

బిక్కచచ్చిపోయినట్టు నటించి "అసలేం జరిగిందిసార్" అన్నాను. అప్పటికే చుట్టూరా జనం చేరుతున్నారు.

జనం అంటే జనంకాదు. పోలీసు సర్కిలినస్పెక్టరొకాయన, ఇద్దరు కాన్‌స్టబుల్స్, ఏనిమల్ హజ్బెండ్రీ ఎ.డి. గారు. ఇలాంటి వాళ్ళు.

అక్కడ మినిస్టరుగారు కేంపువేసిన సందర్భంగా డ్యూటీమీద వచ్చిన వాళ్ళూ పనులు చేయించుకోడాని కొచ్చిన వాళ్ళూనూ.

"ఇంకా ఈ సంగతి కలెక్టర్‌గారికి తెలీదు. తెలిసేముందే పని మొదలు పెట్టండి. మినిస్టరుగారి చేతికర్ర ఎవరో పట్టుకుపోయారు. తెల్లారే లోపుగా అది వారికి వొప్పచెప్పకపోతే ఎవడూ ఉద్యోగంలో వుండడు, ఈ జిల్లామొత్తం మీద!"

చేతికర్ర పోయిందా! ఇంతమందిమి ఇక్కడున్నామే! అదేం నలుసా నల్లపూసా? ఎవడో కళ్ళు గప్పి పట్టుకుపోడానికి ఓ జేబు రుమాలా!"

మూడునెలలకిందట్నించీ ప్రయత్నం, ఈ మినిష్టరుగారి ఈ క్యాంపు ఏర్పాట్లకోసం. ఆయన స్వాతంత్ర్య యోధుడు. వయోవృద్ధుడు, మహాజ్ఞాని, ఎంత జ్ఞానో అంత చండశాసనుడు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో రక్షణ మంత్రి. ఈ వూరు రావడం యిదే మొదటిసారి.

అందుకని మూడు నెలల కిందటే తన ప్రోగ్రాం పంపుతూ, తనని చూడ డానికి రావలసినవాళ్ళ లిస్టొకటి పంపారు. "ఈ లిస్టులో వున్న ప్రతి ఒక్కరికీ తమ కోరిక తెలియజేసి, తాము ఇక్కడ గడపబోయే మూడు రోజులలో ఎవరికి ఎప్పుడు ఎంత సమయం కేటాయించిందీ వివరాలతో నిమిషాలవారీగా కార్యక్రమాన్ని రూపొందించవలసిన బాధ్యత మా జిల్లా కలెక్టర్‌గారికి వొప్ప చెప్పారు మినిస్టరుగారి పి.ఎ.

ఏ–వన్ నుంచి జీ–ట్వెల్వ్ వరకుగల గుమాస్తాల్లో ఉద్దండులంతా కూర్చుని డిస్కస్ చేసి రూపొందించిన మినిట్ - టు–మినిట్ ప్రోగ్రాంని జాగ్రత్తగా టైపు చేసి ఇవ్వగా. కలెక్టర్‌గారు ఆ కాగితాలు తమకి చేరిన నాటి సాయంకాలమే ఏదో అర్జంటు పనిమీద హైద్రాబాదు వెళుతూ, ఇవీ అక్కడికి పట్టుకెళ్ళి అక్కడి ముఖ్యమంత్రిగారి ఆమోదం పొంది, అదే తమ ఆమోదం తమ అభిలాషా పని రాసి కేంద్ర మంత్రి గారికి పంపమన్నారు.

మినిస్టరుగా రిచ్చిన లిస్టులో వున్న ఆసామీల్లో ఒకే ఒక వ్యక్తిని మేం పట్టుకోలేకపోయాం. అతనిపేరు రంగనాధాచారి. అతనిది ఈ ఊరేనని తెలియ జేస్తూ "జైల్ మేట్" 1920-32, 1941-43 అని మాత్రం చహరా యిచ్చేరు.

రాజకీయ బాధితులుగా భూములు కావాలని, కొడుకులకో, అల్లుళ్ళకో ఉద్యోగాలు యిప్పించమని అర్జీలు పెట్టుకున్న ఈ వూరి పెద్దల్లో ఆయనపేరు లేదు. అయినా కేంద్రమంత్రిగా రిచ్చిన పేరుకదా అని, ఆయనా, ఈయనా కల వకపోతే, ఏం మునుగుతుందోనని అప్పట్లో శాయశక్తులా వెతికి "ఆయన అడ్రస్ దొరకలేదు" అని ఫైల్లో రాసుకున్నా, మినిట్-టు-మినిట్ ప్రోగ్రా ములో ఆ పేరుగల ఆసామిని ఉదహరించకండా దాటవేశాం. అక్కడికి గుం డెలు పీచుమన్నా యందరికీనూ. అయితే ఢిల్లీనించి ఆ ప్రోగ్రాం మీద మరే రిమార్కూ లేకండా ఆమోదముద్ర పడిరాగానే గండం గడిచినట్టే నని వూపిరి పీల్చుకున్నాం.

మూడు రోజుల ప్రోగ్రాం లోనూ ఢిల్లీనుంచి సూచించబడ్డ మార్పు ఒకే ఒక్కటి. రెండోరోజు రాత్రి ఎనిమిదిన్నర నుంచి తొమ్మిదివరకు గల అరగంట కాలాన్నీ "స్థానిక ప్రముఖులతో యిష్టాగోష్ఠి" అని మేం రాస్తే అది "అనుకోని అతిథుల కోసం ప్రత్యేకం" అని మార్చారు. ఈ మార్పు జనానికి

తెలిపేటట్టు ప్రచురించమనీ, ఆ సమయంలో అడ్డమైనవాళ్ళూ వొచ్చేసి తనని హింసించకండా చూడమనీ ప్రత్యేకమైన హెచ్చరిక వొచ్చింది.

ఆ రెండూ మాకు కరతలామలకాలే. ఆటే మాటాడితే ఈ "అనుకోని అతిథులు" ఎవరోకూడా మేమే నిర్ణయించి, మేం మొదట అనుకున్న స్థానిక ప్రముఖులనే అక్కడ సమావేశ పరచి, మేం మొదట అనుకున్న ఇష్టాగోష్ఠి కార్యక్రమాన్నే అక్కడ ఏర్పాటు చేయగల సామర్థ్యం మా యంత్రాంగానికుంది.

కాని అలా చెయ్యకండా "ఇందుమూలంగా సమస్త జనులకు తెలియ యడ మేమనగా——" పద్ధతిలో ఈ అరగంట గురించి ప్రచారం చేసి వూరుకున్నాము.

మినిష్టరుగారు పంపిన లిస్టులో వ్యక్తులందరికి. ఎవరికి కేటాయించిన సమయంలో వారు మినిష్టరుగార్ని చూడడానికి వీలుగా, రానూ పోనూ ప్రయాణపు ఏర్పాట్లు చేయడానికి చాలినన్ని జీపులు, కార్లు సిద్ధంచేసి వుంచుకున్నాం.

ఈ "అనుకోని అతిథులు" మొత్తం నలుగురు తేలారు. వాళ్ళలో ఇద్దరు తొలిరోజు కార్యక్రమంలో సమయం కేటాయించబడిన్నీ సమయానికి లభ్యం కానివారు. ఒకరు ఏదో పుస్తకం రాసి మనిష్టరుగారికి అంకితం యివ్వడం కోసం వారి అనుమతి కోసం వచ్చినవారు.

నాలుగోవ్యక్తి మేం ఆనాడు కనుక్కోలేక వదిలేసిన రంగనాధాచారిగారు. రాత్రి ఎనిమిదిన్నర గంటలకి మొదలయ్యే కార్యక్రమానికి సాయంకాలం ఆరున్నరకే సిద్ధమైపోయి. లౌంజీలో వుండనిస్తారో లేదోనని మొహమాటపడి గెస్టు హౌసు చుట్టూరా వున్న చెట్లలో వొకదానికింద చతికిలపడి కూర్చున్నాడు. ఆ సంగతి నేను ఆడున్నరకే గమనించినా, ఎనిమిదిన్నరకే అతన్ని లోపలికి అహ్వానించేను. కాఫీ పుచ్చుకుంటారా అని అడిగితే ఆయన మాట్టాడలేదు.

ఆ తరవాత నేనూ మాట్టాడలేదు.

మొదటి ముగ్గురు "అనుకోని అతిథులూ" మినిష్టరుగారు లౌంజీలోకి రాగానే చకచకా మాట్లాడేసి వాళ్ళ పన్లు నిలబడి పూర్తి చేసుకున్నారు. ఈయన కూర్చున్న చోట కదలకుండా కూర్చున్నాడు. మినిష్టరుగారు ఈయన్ని చూడగానే "అయ్యో, నువ్వొచ్చావా?" అంటూ ఆప్యాయంగా ఆయన్ని పలకరించి,

పక్కన కూచుని "ఇక్కడెందుకు లోపల మాట్లాడుకుందాం రా!" అని లేవదీసి ఆయన్ని తీసుకుపోయారు.

మినిష్టరుగారు, కుటుంబం భోజనాలు చేసేరు; ఆయనా అక్కడే భోం చేశారు.

"భోజనానికి కక్కుర్తి పడేవాళ్ళలో ఎనభై ఏళ్ళ వాళ్ళుకూడా వుంటున్నారన్న మాట" అని మాలో మేం జోకులేసుకున్నాం. మినిష్టరుగారు మా వూరు సంవర్శించే సందర్భంగా భోజనం మొదలైన ఏర్పాట్లకీ, గెస్టుహౌసు మరమ్మత్తులకీ ముప్ఫై వేల రూపాయలు శాంక్షనై మా చేతుల్లో ఉన్న సంగతీ, మేం అందరంకూడా గెస్టుహౌసులోనే కాఫీలూ, భోజనాలూ కానిస్తున్న సంగతి గుర్తొచ్చింది. కాని పైకి అనుకోలేదు మేం ఎవరమూనూ.

సరిగ్గా తొమ్మిదీఇరవై ఐదుకి ఈయన ఇవతల పడ్డాడు. "అనుకోని అతిథులకి" ఇళ్ళకు వెళ్ళేందుకు వాహనాల ఏర్పాటు చేసే బాధ్యత నెత్తిన వేసుకోలేదు కనక ఆ రాత్రప్పుడు ఆ ఎనభై ఏళ్ళ ముసలాడు నడిచి వెళ్తున్నాడా సిటీబస్సు దొరుకుతుందా అనే విషయం మేం ఎవరమూ పట్టించుకోలేదు.

తొమ్మిదీ నలభైకి మినిష్టరుగారు తమకి ఆరుబయట కాసేపు కూర్చోవాలని వుందని కుర్చీలు వేయించమని చెప్పారట- వేయించాం.

పదిహేను నిమిషాలైంది, కుర్చీలు ఆరుబైట అలా ఖాళీగానే వున్నాయి. ఇదిగో వస్తారు, అదిగో వస్తారని చూస్తున్నాం. ఇంతలోనే ఇది——

ఆరుబైట కుర్చీలదాకా వెళ్ళడానికి మినిష్టరుగారు చేతికర్ర కోసం వెతుక్కుంటే అది కనబళ్ళేదు,

క్షణాలమీద వివరాలు వచ్చేశాయి. ఆ చేతికర్ర "ఎబనైట్ బ్రౌన్" రంగుది. మూడడుగులు పొడుగుంటుంది.

మినిస్టరుగారు పన్నెండేళ్ళ క్రితం వెస్టుజర్మనీ వెళ్ళినప్పుడు ఒక సైంటిస్టు ఆయనకా చేతికర్ర ప్రజెంటు చేశారు.

ఆ చేతికర్ర హాండిల్‌కి స్క్రూ పద్ధతి వుంది. నాలుగైదు రకాల హాండిల్సును ఆ కర్రకి స్క్రూ పద్ధతిని బిగించుకోవచ్చును. అభిరుచిని బట్టి, అవసరాన్ని బట్టీనూ,

జర్మనీలో ఒక కీకారణ్యంలో పెరిగిన ఒకానొక ప్రత్యేక జాతికర్రను, ఏ రెండు వందల ఏళ్ళోదాచి, సీజన్ చేసి, తయారుచేశారా చేతికర్ర.

ఖరీదా? అబ్బో, చాలా వుంటుంది.—ఎంతా అంటే ఎంతని చెప్పడం అరవై ఏళ్ళ రాజకీయజీవితం, ఇరవై ఎనిమిదేళ్ళ మంత్రిత్వ అనుభవం,అఖండమైన మేధా సంపత్తీ అసలు సంపత్తీకూడా కలిగిన ఒక స్వాతంత్ర్యయోధుడికి, అంతకంటె ఎక్కువ మేధావంతుడు జర్మనీ సైంటిస్టూ అభిమానంగా ఇచ్చిన కానుక అది. అడవిలో వందేళ్ళు పెరిగిన చెట్టుదే కావచ్చు. కొట్టిన తరవాత రెండువందలేళ్ళు దాచింది కావచ్చు. కానీ మినిస్టరుగారి చేతుల్లో పన్నెండేళ్ళ నుంచీ వున్న కర్ర. దాని విలువ యింతా అని ఎలా చెప్పడం!

చచ్చు సంభావన మూడువేలుండొచ్చు.

“చూడండి, చూడండి! ఆ చేతికర్రని మినిష్టరుగారు నేషనల్ మ్యూజియంకి ప్రెజెంటు చేద్దామనుకుంటున్నారట. పట్టుకుపోయినవాడెవడో తెల్లారి పేలంవేసి ఊళ్ళోంచి జారుకుంటాడో ఏమిటో? టౌనంతా గాలించి రాత్రికిరాత్రే తెచ్చి వొప్పచెప్పండి!” అని తొందర చేశారు తాసిల్దారుగారు.

సర్రుమని డి. ఐ. జీ. గారి కారొచ్చి ఆగింది. అంతకంటె ఫోర్సుగా ఆయనా దిగారందులోంచి.

“అలాంటి వస్తువుని ఎవడో పట్టుకుపోతుంటే అంతా నిద్రపోతున్నారటయ్యా? అందులో ఏమి ఇంపార్టెంట్ సీక్రెట్సు వున్నాయో! మినిస్టరుగారు చాలా ఆందోళన పడుతున్నారని వారి పియ్యేగారు చెప్తే వొచ్చాను” అన్నారాయన.

చేతికర్ర స్క్రూ విప్పితే ఒక గొట్టాం వుండడం, అందులో ఒక గొప్ప ప్లానో, ప్రణాళికో కాలనాళికో వుండడం వూహించుకున్నాం. ఆత్మ రక్షణకోసం ఒక కత్తి అయినా చేతికర్రలో నిక్షిప్తమయి వుండకపోతుందా అనికూడ గుసగుస లాడుకున్నాం.

పావుగంట గడిచేలోగా చేతికర్రను వెతికి పట్టుకోడానికి ప్రణాళిక సిద్ధం అయింది. పన్నెండు జీపులు, నాలుగు కార్లు ఎలాట్ చేశారు. నగరం అంతా పదహారు భాగాలుగా విభజించుకుని ఒక్కొక్క పార్టీకి ఒక కానిస్టేబిలు, ఒక సీనియర్ పోలీసు లేక ఇనస్పెక్టరు ఒక సివిల్ అధికారి—

నా పార్టీకి రంగరాజుపేట వచ్చింది.

“తెల్లవారేదాకా వెతకండి. ఉదయం మైకుల్లో ప్రచారం చేద్దాం. చేతికర్ర మీరు తెచ్చిచ్చేదాకా మేం మా బంగళాలో మేలుకుని కూచుంటాం. ఇంటింటికీ

వెళ్ళి తలుపులు కొట్టండి. ఆ ముసలాయనే పట్టుకుపోయి ఉంటాడు.ఎంత అను కోని అతిథి అయినా మినిష్టరుగారు భోజనానికి తీసుకెళ్ళడం, చూసేకయినా అత నెవరో, ఎడ్రసేమిటో తెలుసుకోకుండా ఆయన్ని వొదిలేస్తారటయ్యా?

బయల్దేరాం.

మిగతావాళ్ళంతా ఏం అవస్థలు పడుతున్నారో తెలీదుగాని, రంగరాజు పేట సందుల్లో జీప్ తిప్పుకుంటూ యింటింటి తలుపూ కొట్టి-ఎనభయ్యేళ్ళు పైబడ్డవాడు; స్వాతంత్ర్య పోరాటంలో రెండుసార్లు జైలు కెళ్ళినవాడు;బక్కగా ఎర్రగా వుంటాడు అనే వర్ణనతో ఆయన ఇల్లు వెతకడం మహా కష్టమూ, యమ యాతనా అయిపోయింది మాకు.

చివరకి ఒక ఇరుకు సందులో పట్టుకున్నాం. మా యూనిట్ వాళ్ళమే.

తలుపు తెరిచేసరికి మావాళ్ళు ఆయన మీద పడ్డారు. "ఏమయ్యా! మళ్ళీ జైలు కెళ్ళాలనుందా?" అంటూనూ.

ఆయన వెర్రిమొహం వేశాడు.

పేరు. అడ్రసు అన్నీ రాసుకోడం అయింది. చేతికర్ర సంగతి చెప్పే సరికి ఆయన విపరీతందా బాధపడిపోయి "అయ్యో! ఎంతపనయిపోయింది! గాభ రాలో నాదే అనుకుని వాడి చేతికర్ర తెచ్చేశానా?" అన్నాడు. మినిష్టర్‌గార్ని గురించి వాడూ వీడూ అని మాట్లాడితే పరిస్థితులు బాగుండవని గట్టిగా వార్నింగ్ ఇచ్చారు మావాళ్ళు.చేతికర్ర మా చేతికి చేరగానే ముసలాయనకదా అని అయినా ఆలోచించకుండా. ఆ చేతి కర్రతోనే ఆయన్ని కొట్టినంతపని చేశారు. కాని ఆ కర్రకాస్తా ఆయన నడుంమీద విరిగితే మానడుములు విరుగుతాయన్న భయం చేత కంగారుగా జీప్ ఎక్కాం.

పన్నెండయింది రాత్రి.

కలెక్టర్‌గారి బంగాళాలో అక్షరాలా కళ్ళలో వొత్తులేసుకుని మేలుకుని కూచున్నారు జిల్లా ముఖ్యాధికారులంతాను. చేతికర్ర పట్టుకెళ్ళేసరికి అధికార తారతమ్యాలు మరిచి షేక్హాండివ్వడానికి చేతులన్నీ ముందుకొచ్చాయి.ఎవరిళ్ళకి వాళ్ళెళ్ళిపోడానికి కాళ్ళు వొచ్చాయి. ఉదయం ఆరింటికి గెస్టుహౌస్ దగ్గర కొస్తామని చెప్పేసి గుడ్‌నైట్‌లు కొట్టాం.

వుదయం ఆరుంపావుకల్లా గెస్టుహౌస్‌కి కలెక్టరుగారి కారొచ్చింది.

ఒక పసుపుపచ్చని ముఖమల్‌గుడ్డలో జాగ్రత్తగా చుట్టి తెచ్చారు మిని

ష్టరుగారి చేతికర్రని. నలిగిపోతుందో విరిగిపోతుందో గెద్ద తన్నుకు పోతుందో మాయమైపోతుందో అన్నట్టు, పసిపాపని పట్టుకున్నట్లు, అల్లుడి కిచ్చే తాంబూల ప్పళ్ళేన్ని పట్టుకున్నట్టు రెండు చేతుల మీదా యెత్తిపట్టుకున్నారు వారు అ చేతి కర్ర మూటను. సరాసరి మినిస్టర్‌గారి గదిలో కెళ్ళి వొప్ప చెప్పడానికి ఆయన నింపాదిగా నడుస్తూ వెళుతూ వుంటే దూరదేశాల కెళిపోయే నావను చూసే తీర వాసుల్లా చూస్తూనిలబడ్డాం అందరమూనూ.

మినిస్టర్‌గారు చాలా సంతోషించేరుట. కర్రను వెతికి తెచ్చిన వాళ్ళకి ప్రత్యేకం థాంక్స్ చెప్పమన్నారుట. ఆ కర్ర పట్టుకు పోయినప్పుడు తాను వది లేసిన తన చేతికర్రను రంగానాథాచారిగారికి ఇచ్చేయమన్నారుట.

మినిస్టరుగారి పియ్యేగారు నన్ను పిల్చి రంగనాథాచారిగారి చేతికర్రని చూపించి, "ఇది ఆయనకిచ్చేసి, అందినట్టు రసీదు పట్రండి. మీరేగా, రాత్రి రంగనాథాచారి ఇంటికి వెళ్ళింది!" అని గద్దించారు.

ఔనని తలూపాను.గదిమూలాన నిలబడున్న రంగనాథాచారిగారి చేతికర్రని తీసుకున్నాను.

రాత్రి నాతో వొచ్చిన పోలీసు ఆఫీసర్ రమణయ్యగారూ, నేనూ మళ్ళా రంగరాజుపేట బయలుదేరాం. నన్ను పక్కకినెట్టి రమణయ్యగారు ముందు కెళ్ళాడు. ఒంటిచేత్తో నమస్కారం చెప్తూ రంగనాథాచారిగారికి కర్ర అందిం చాడు.

"చాలా థేంక్స్ బాబూ!" అన్నారాయన.

"చేతికర్ర తమ కందినట్టు రశీదు రాసివ్వండి" అన్నాడు రమణయ్య గారు.

"ఎందుకు! చేతికర్ర నాకు అందిందని చెప్పండి: చాలు" అని రంగ నాథాచారిగారు తలుపు వేసేశాడు.

రమణయ్యగారు తలుపు తట్టాడు. ఆయన తలుపుతీసి "ఏం, ఇంకా నుంచున్నాట?" అన్నాడు.

"అది కాద్సార్. రశీదు...."

"రశీదెందుకు? నా కర్ర నాకందింది. అతని కర్ర అతని కందింది. మీ డ్యూటీ మీరు చేశారంతే."

"రశీదు ఫైల్లోకి కావాలంటండి."

"ఫైల్లోకి కావాలా? మరి నే నిచ్చిన చేతికర్ర ఆయన కందిందని ఒక రశీదు నా ఫైల్లోకి అక్కర్లేదు? అదీలేదు, ఇదీ లేదు. వెళ్ళండి, వెళ్ళండి."

"మీ దగ్గర్నుంచి తీసుకెళ్ళింది మినిస్టర్ గారికి స్వయంగా కలెక్టర్ గారు అందజేశారు సార్! వారి కది అందిందండి."

"నే చెప్పేదీ అదే. వారికది అందింది, నాకిది అందింది. ఆ రశీదుతెస్తే ఈ రశీదు ఇస్తాను. నే నా చేతికర్రను వేలం వేసేసి లక్షలార్జించ బోతున్నానని, నన్ను జైల్లో పెడతానని అన్న పెద్దమనిషిని నువ్వేగా! పోయిరా. ఆయన మీకు మినిస్టర్ అయితే, నేను ఆయనకి స్నేహితుణ్ని, గురువుని. వెళ్ళండి, నాకు పనుంది" అని ఆయన వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

"రాత్రి నేను చెప్పాను. జులుం చెయ్యకండయ్యా బాబూ అని, విన్నారు కాదు!" అని అన్నాను రమణయ్యగారితో.

"మీరోసారి అడిగి చూడండి."

"ఆయనలా ఫైరై పోతూ వుంటే ఎలా అడగను? నావల్లకాదు."

"రాత్రి ఆ టెన్షన్‌లో ఏదో నోరు జారాం అనుకోండి" అన్నాడు రమణయ్యగారు.

మళ్ళీ రంగనాథాచారి గారొచ్చేరు. ప్రభుత్వ పద్ధతులనీ, బ్యూరోక్రసీని ఆక్షేపిస్తూ ఆవేశపడ్డారు. రమణయ్య అవన్నీ నిజమే అని ఒప్పుకుంటూ రశీదుకోసం కాళ్ళావేళ్ళాపడ్డాడు.

ఆయన ఒక్కపిసరు కూడా బెసగలేదు.నిజమైన స్వాతంత్ర్య యోధుళ్ళా నిలబడిపోయాడు. "ఊళ్ళోకి ఫలానా మినిస్టర్ గారొస్తున్నారు. కావలసినవాళ్ళు కలుసుకోవచ్చు అని ప్రకటించిన వారు, నేను కలుసుకోవాలని భోగట్టా అడిగితే దరఖాస్తు పెట్టమన్నారు. రెండు రూపాయల కోర్టు ఫీ స్టాంపు అంటించమన్నారు. నేను పొరపాటున ఆయన కర్ర తెస్తే అది తీసుకోడానికి అర్ధరాత్రి వూళ్ళో సహాం పుందిని లేపారు. మీ పద్ధతులు మంచివికావు. మార్చుకోండి. లేకపోతే దేశం పాడైపోతుంది!"

మేం మాట్లాడకుండా వెనక్కొచ్చేశాం.

***